తెలుగు దినపత్రిక
jayabheridaily.com
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 01
సంచిక : 191
పేజీలు : 4
వెల : 4
మల్కాజిగిరి
సోమవారం 19-02-2024



**మేడారం జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు** 2లో

# మొరాయిస్తే ఏం చేస్తారో తెలుసా..!

- పర్యవేక్షణకు మొబైల్ టీమ్ లు
- జాతర మార్గంలో క్యాంపులు
- అందుబాటులో క్రేన్లు

మేడారానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు మొదలయ్యాయి. అయితే మధ్యలో బస్సులను మెరాయిస్తే చేయాల్సిన పనులపై కూడా ఫోకస్ పెట్టింది సర్కార్. తెలంగాణ కుంభమేళ, మేడారం మహాజాతర ఇంకో నాలుగు రోజుల్లోనే ప్రారంభం కాబోతోంది. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు మహా జాతర బ్రహ్మాండంగా జరగనుండగా భక్తులను మేడారం చేరవేయడంలో ఆర్టీసీ దే ప్రధాన పాత్ర. ఇందుకు ఆర్టీసీ కూడా తగిన విధంగా సిద్ధమవగా.. బస్సులకు మెయింటెనెన్స్ కష్టాలు వెంటాడనున్నాయి. దీంతోనే అడపాదడపా బస్సులు ట్రబుల్ ఇచ్చే అవకాశాలు కూడా ఉన్నాయి. అయితే జాతరకు అన్ని విధాలా సిద్ధమైన ఆర్టీసీ బస్సులు మొరాయిస్తే క్విక్ యాక్షన్ చేపట్టేందుకు కూడా రెడీ అయ్యింది. మొరాయించిన బస్సులను వెంటనే గాడిలో పెట్టేందుకు అధికారులు తగిన చర్యలు చేపడుతున్నారు. ప్రత్యేక టీమ్ లు ఏర్పాటు చేసి, భక్తులు అసౌకర్యానికి గురి కాకుండా చర్యలు చేపట్టేందుకు రెడీ అయ్యారు. ఇందుకు అదనపు సిబ్బందిని అందుబాటులో ఉంచడంతో పాటు వారందరికీ ఇప్పటికే వివిధ అంశాల్లో ట్రైనింగ్ కూడా పూర్తి చేశారు.



# గత సర్కార్ నిర్ణయాలను కొనసాగిస్తాం..!

- హైదరాబాద్ అభివృద్ధిపై సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు

**జయభేరి, హైదరాబాద్ :**

హైదరాబాద్ అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. గత 30 ఏళ్లలో హైదరాబాద్ నగర అభివృద్ధి కొనసాగిందని చెప్పుకొచ్చారు. గత సర్కార్ తీసుకున్న నిర్ణయాలను కూడా కొనసాగిస్తామని.. అభివృద్ధి కోసం మరిన్ని చర్యలు తీసుకుంటామని అన్నారు. నానక్ రామ్ గూడలో తెలంగాణ స్టేట్ ఫైర్ సర్వీసెస్ హెడ్ క్వార్టర్స్ బిల్డింగ్ ను ప్రారంభించారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన... ప్రమాదం జరిగినపుడు అందరికంటే ముందుండేది ఫైర్ డిపార్ట్ మెంట్ అని, ప్రజల రక్షణ కోసం ఫైర్ సిబ్బంది ప్రాణాలకు తెగించి పోరాడుతారని కొనియాడారు. ప్రపంచంతో హైదరాబాద్ నగరం పోటీ పడుతోందని... నగరంలో శాంతి భద్రతలు సరైన విధంగా ఉంటేనే పెట్టుబడులు వస్తాయని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ నగరం పెట్టుబడులకు అనువైన ప్రాంతమన్న ముఖ్యమంత్రి... గత ముప్పై ఏళ్లలో రాజకీయాలు ఎలా ఉన్నా హైదరాబాద్ నగర అభివృద్ధి కొనసాగిందని చెప్పుకొచ్చారు.




# బీజేపీ సైడ్ ట్రాకేనా

**జయభేరి, హైదరాబాద్, ఫిబ్రవరి 18:**

తెలంగాణ రాజకీయాల్లో భారతీయ జనతా పార్టీ మెల్లగా సైడ్ ట్రాక్ పడుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య హోరాహోరీ పోరు సాగుతోంది. లోక్ సభ ఎన్నికలు దగ్గర పడటంతో బీఆర్ఎస్ రేసులోకి వచ్చేందుకు అన్ని అస్త్రాలను ప్రయోగిస్తోంది. ఆ పార్టీకి గట్టి కౌంటర్ ఇచ్చేందుకు అధికార పార్టీ అదే దూకుడు ప్రయోగిస్తోంది. ఈ క్రమంలో బీజేపీ వెనుకబడిపోతున్న సూచనలు కనిపిస్తున్నాయి. కృష్ణా ప్రాజెక్టులు, కాళేశ్వరం విషయంలో బీజేపీ తన వాదనను సమర్థంగా వినిపించలేకపోయింది. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే సమరం సాగుతోందన్న అభిప్రాయం వినిపించడం ప్రారంభమయింది. అసెంబ్లీలో కృష్ణా ప్రాజెక్టుల అప్పగింతపై

# దారుణంగా.. వీధి కుక్కలను చంపేసి...



**జయభేరి, మహబూబ్ నగర్, ఫిబ్రవరి 17**

కారులో వచ్చి.. గ్రామంలో అమానుషం సృష్టించారు. వీధుల్లో కనిపించిన ఏ కుక్కను వదలకుండా తుపాకీ గుండ్ల వర్షం కురిపించారు దుండగులు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. మహబూబ్ నగర్ జిల్లాలోని అడ్డాకుల మండలం పొన్నకల్ గ్రామంలో దారుణం జరిగింది. అర్ధారత్రి దాటిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు వీధికుక్కలపై విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. రాత్రి సుమారు 2 గం.ల తర్వాత ఒక్కసారిగా గ్రామంలో తుపాకి కాల్చిన శబ్దం, వీధికుక్కల అరుపులు భయందోళనకు గురిచేశాయి. గుర్తుతెలియన వ్యక్తులు గ్రామంలోకి చొరబడి కనిపించిన వీధికుక్కలపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. తుపాకీ చప్పుల్లకు గ్రామంలో ఏం జరుగుతుందోనని ప్రజలు ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రాలేదు. తీర ఉదయం లేచి చూసేసరికి వీధికుక్కలపై యుద్ధం జరిగినట్లుగా గ్రామంలో పరిస్థితి కనిపించింది. మొత్తం 30కుక్కలపై కాల్పులు జరుపగా సుమారు 21కుక్కలు మరణించాయి. మరికొన్నింటికి తీవ్రంగా గాయాలు అయ్యాయిఅర్ధరాత్రి 2 గంటల సమయం దాటిన తర్వాత ఈ ఘటన జరిగిందని గ్రామస్థులు చెబుతున్నారు. స్విఫ్ట్ కారులో గ్రామంలోకి ఎంట్రీ ఇచ్చిన దుండగులు కనిపించిన ఏ కుక్కను వదలకుండా తుపాకీతో కాల్పులకు తెగబడ్డారు. గల్లీ గల్లీ తిరుగుతూ ఒక్కో కుక్కను వెంబడించి మరి హతమార్చారు దుండగులు. స్థానికుల సమాచారంతో పోలీసులు గ్రామానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీం, వెటర్నీరి డాక్టర్లు మరణించిన కుక్కలను పరిశీలించారు. కుక్కల శరీరాల్లో బుల్లెట్లు ఉన్నట్లు గుర్తించారు. అసలు కాల్పులు జరిపిన వ్యక్తులు ఎవరూ? కుక్కలను ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారు అన్న అంశంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నాటు తుపాకీని ఉపయోగించినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే కాల్పులకు పాల్పడింది నార్త్ కు చెందిన దొంగల ముఠానా ఇంకా ఎవరైనా ఉంటారా అన్న కోణంలోనూ పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

**నవశకానికి నాంది పలుకుదాం..**
**భవితవ్యం ప్రశ్నార్థకం...**
**రోజురోజుకు పడిపోతున్న చిన్నపిల్లల వృద్ధి..** 2లో



# చెప్పాం.. చేసి చూపిస్తాం...

**జయభేరి, హైదరాబాద్, ఫిబ్రవరి 18:**

మేము మాట ఇచ్చాము ఆ మాట ప్రకారం నిర్ణయం తీసుకున్నాం అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కులగణననీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినందుకు అందరికీ ధన్యవాదాలు.. మేము ఎవరికి వ్యతిరేకం కాదు.. అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకున్నామని ఆయన చెప్పారు. బడుగు బలహీన వర్గాలు సామాజిక, రాజకీయ, ఉద్యోగాల్లో ఎదగాలని మా ప్రభుత్వ ఆకాంక్ష.. మాజీ బీసీ వెల్ఫేర్ మినిస్టర్ నిన్న బిల్లు ప్రవేశపెట్టిన సమయంలో అనేక సార్లు సభను తప్పుదోవ పట్టించే విధంగా వ్యవహరించారు.. ఆ మాజీ మంత్రి తీర్మానంపై అనుమానం వ్యక్తం చేయడం శోచనీయం అని పొన్నం ప్రభాకర్ అన్నారు.ఆ మాజీ మంత్రికి బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే 10 సంవత్సరాల్లో మీ గొంతు ఎందుకు మాట్లాడలేకపోయిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సకల జనుల సర్వే రిపోర్ట్ ఎందుకు బయటపెట్టలేదు? మీరు ఎప్పుడైనా మీ పార్టీ ఇంటర్నల్ మీటింగ్ లో అడిగారా?.. నిన్న సలహాలు సూచనలు ఇవ్వమంటే.. ఎంత సేపు విమర్శలు చేసే ఆలోచనతో పోతున్నారు.. అనుమానాలు పక్కన పెట్టి ఇప్పటికే కుల గణన జరిపిన అయా రాష్ట్రాల నుంచి తెలుసుకోవాలి అని ఆయన చెప్పుకొచ్చారు. జనగణన సర్వే 100 శాతం ప్రయోజనం జరిగే విధంగా ముందుకు పోతాం.. నిధుల కొరత లేదు..

▶▶ మొదటిపేజీ తరువాయి

## మేడారం జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

రాష్ట్ర వ్యాప్తంగా ఈసారి 51 సెంటర్ల నుంచి మేడారం మహాజాతరకు ఆరు వేలకు పైగా బస్సులు నడిపేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. మహాలక్ష్మీ పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం అందుబాటులోకి తీసుకురావడంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య ఈసారి ఎక్కువగానే ఉండనుంది. కాగా మేడారానికి ప్రత్యేక బస్సులు ఇవాళ్టి (ఫిబ్రవరి 18) నుంచి ప్రారంభం అయ్యాయి. 24వ తేదీ సమ్మక్క-సారలమ్మ వనప్రవేశ ఘట్ట పూర్తయిన మరుసటి రోజు 25వ తేదీ వరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నిరంతరాయంగా నడవనున్నాయి. మేడారం జాతర రోడ్లు ఎక్కే ముందుగానే బస్సులను ఓవర్హాలింగ్ చేస్తుంటారు. అన్నీ సక్రమంగా ఉన్నాయో లేదో కూడా చూస్తుంటారు. అయినా అప్పుడప్పుడు బస్సుల్లో సమస్యలు తలెత్తుతుంటాయి. తాజాగా హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి సమీపంలో రన్నింగ్ లో ఉన్న బస్ టైర్లు ఊడిపోయిన ఘటన కూడా ఇదే కోవకు వస్తుంది. ఇలా అనుకోకుండా బస్సులకు రిపేర్లు వస్తుంటాయి. ఇక మేడారం జాతర వేళ ఆర్టీసీ బస్సులు మార్గమధ్యలో ఆగిపోయినా, ఫెయిలైనా, ఇతరత్రా ఏ సమస్యలు వచ్చినా భక్తులు తీవ్ర ఇబ్బందులు పడక తప్పదు. దీంతోనే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు వెంటనే రిపేర్లు చేసేలా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ మేరకు 12 మొబైల్ టీమ్ లు ఏర్పాటు చేశారు. వారంతా నిరంతరం జాతర విధుల్లోనే ఉండనుండగా.. ఒక్కో టీమ్ లో ఇద్దరు మెకానిక్ లు, ఎలక్ట్రిషియన్ ఉంటారు. ఎప్పుడు ఎలాంటి సందర్భం ఎదురవుతుందో తెలియదు కాబట్టి ఆర్టీసీ అధికారులు ముందు జాగ్రత్త చర్యలపై ఫోకస్ పెట్టారు. ఈ మేరకు మెకానిక్ బృందాలను ఏర్పాటే చేసిన అధికారులు జాతర మార్గంలో ఎక్కడికక్కడ మెయింటెనెన్స్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. హనుమకొండ, గుడెప్పాడు, గట్టమ్మ, పస్రా, తాడ్వాయి, జంగాలపల్లి, గణపురం, కాటారం, నార్లాపూర్, కామారం, కొండపర్తి, మేడారం ఇలా మొత్తం 12 చోట్లా టీమ్ లను అందుబాటులో ఉంచనున్నారు. ఒకవేళ బస్సు ట్రాఫిక్ లో చిక్కుకుని, కారు లాంటి ఫోర్ వీలర్ బండ్లు చేరుకోలేని ప్రదేశాల్లో ఇబ్బందులు తలెత్తితే.. అక్కడికి ద్విచక్రవాహనంపై వెళ్లి రిపేర్లు చేసి వచ్చేలా చర్యలు చేపడుతున్నారు. ఆయా బృందాలకు సంబంధించిన సభ్యులకు ప్రత్యేకంగా పరిధి కేటాయించి, విధులు అప్పగిస్తున్నారు. ఇక వారి పరిధిలో బస్సుల్లో ఏదైనా లోపాలు తలెత్తితే సాధ్యమైనంతా తొందర్లో వారు అక్కడికి చేరుకుని మరమ్మతులు చేసి, బస్సును మళ్లీ రోడ్డెక్కించేందుకు కృషి చేస్తారు. మెయింటెనెన్స్ క్యాంపుల్లో ఉండే సిబ్బంది వెళ్లి రిపేర్లు చేసినా.. బాగు కాకపోతే ఆయా బస్సులను వెంటనే ఆ రోడ్డు నుంచి తప్పించేలా కూడా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సమస్యతో నిలిచిపోయిన బస్సును తరలించడానికి ప్రత్యేకంగా క్రేన్, ట్రాక్టర్లు కూడా అందుబాటులో ఉంచుతున్నారు. ఒకవేళ ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే క్రేన్ సహాయంతో బస్సును అక్కడి నుంచి లిఫ్ట్ చేస్తారు. మిగతా వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు చేపడతారు. దీంతో మేడారం మార్గంలో బస్సులు నిలిచిపోకుండా చూడటంతో పాటు ట్రాఫిక్ లో చిక్కుకున్న వాహనాలను వెంటనే తరలించేందుకు పెట్రోలింగ్ టీమ్ లు కూడా ఏర్పాటు చేశారు. ఈ పెట్రోలింగ్ టీమ్లు ఎప్పటికప్పుడు మేడారం మార్గంలో పర్యటిస్తూ.. వారివారి పరిధిలో బస్సులు, ఇతర వాహనాలపై దృష్టి పెడతారు. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే వాహనాల రాకపోకలు క్రమబద్ధీకరించేలా చర్యలు తీసుకుంటారు. ఇలా మేడారం మహాజాతరకు పక్కా వ్యూహంతో సిద్ధమైనట్లు అధికారులు చెబుతుండగా.. వారి ప్రయత్నాలు ఏమేరకు ఫలిస్తాయో చూడాలి.

## గత సర్కార్ నిర్ణయాలను కొనసాగిస్తాం..!

“హైదరాబాద్ నగర అభివృద్ధికి గత ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలను కొనసాగిస్తూనే, మరింత ఉన్నతంగా నగరాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. తెలంగాణ అభివృద్ధికి మెగా మాస్టర్ ప్లాన్ తీసుకొస్తాం. త్వరలో 2050 మెగా మాస్టర్ ప్లాన్ తీసుకు రాబోతున్నాం. అర్బన్, సెమీ అర్బన్, రూరల్ మూడు భాగాలుగా అభివృద్ధిని ముందుకు తీసుకెళతాం. ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలోని 25వేల ఎకరాల్లో హెల్త్, స్పోర్ట్స్, కాలుష్య రహిత పరిశ్రమలతో ఒక సిటీని ఏర్పాటు చేయబోతున్నాం. మెట్రో రద్దు కాలేదు, ప్రజలకు ఉపయోగపడేలా మెట్రో విస్తరణ చేయబోతున్నాం. ఫార్మా సిటీలు కాదు. ఫార్మా విలేజ్ లు ఏర్పాటు చేస్తాం. అపోహలు వద్దు. మా ప్రభుత్వానికి స్పష్టమైన విధానం ఉంది. మాకు మేమే మేధావులమని భావించం. అనుభవజ్ఞులు, నిపుణుల సలహాలతో ముందుకెళతాం. గతంలో సృష్టించిన సమస్యలను పరిష్కరిస్తూ, భవిష్యత్ ప్రణాళికలు రూపొందిస్తూ ముందుకెళతాం” అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆలోచించి నిర్ణయం తీసుకోవడమే తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. చట్టాన్ని ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదన్నారు.ఎల్బీ నగర్ నుంచి హయత్ నగర్ వరకు మెట్రోను విస్తరిస్తామని చెప్పారు. హైదరాబాద్ ను అన్ని విధాలా అభివృద్ధి చేసుకుందామన్నారు. అధికారుల నియామకంలో కూడా అన్ని ఆలోచించి నిర్ణయాలను తీసుకుంటున్నామని చెప్పారు. పారదర్శకంగా ఉండే అధికారులనే నియమిస్తున్నామని అన్నారు. హైదరాబాద్ లోని బిల్డర్లకు పూర్తి స్థాయిలో సాకారం అందిస్తామని స్పష్టం చేశారు ముఖ్యమంత్రి. కొన్ని నిర్ణయాలను తీసుకునేందుకు ఆలస్యం అవుతుందని... ఇందుకు కూడా కారణాలు ఉన్నాయని చెప్పారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. అన్నింటిపై కసరత్తు చేసే నిర్ణయాలను ప్రకటిస్తామని.. ఇందుకోసం కొంత సమయం తీసుకుంటామని అన్నారు. అధికారులను అన్ని వేళలా అందుబాటులో ఉంటానని... ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరిస్తామని వెల్లడించారు. డిపార్టుమెంట్లలో ఉన్న ఖాళీలను కూడా భర్తీ చేస్తామన్నారు. పోలీస్ శాఖలో ఉన్న వసతులన్నింటిని... ఫైర్ శాఖలో ఉన్న వారికి కూడా వర్తింపజేస్తామని పేర్కొన్నారు.

## చెప్పాం.. చేసి చూపిస్తాం...


ఎలాంటి అనుమానం అవసరం లేదు.. మురళీదర్ రావు కమిషన్ లో విద్యార్థి దశగా ఉన్నప్పటి నుండే దీనిపై ఉద్యమించాం.. పార్లమెంట్ లో బిల్లు ఆమోదం పొందే వరకు మేము ఉన్నామని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.ఇక, కులగణన 1931లో చేసిన తరువాత 2011లో మన్మోహన్ సింగ్ నాయకత్వంలో జరిగింది అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పుకొచ్చారు. ఆ తరువాత ఇప్పుడే కుల గణన జరుగుతుంది.. భవిష్యత్ లో ఫిబ్రవరి 16 మరో చారిత్రాత్మక ఘట్టం.. మా పార్టీ నాయకత్వం అన్ని రకాలుగా సహకరించారు.. మేధావులు ఎవరైనా సలహాలు సూచనలు చెప్పాలి.. ఇది కాంగ్రెస్ పార్టీ నిర్ణయం అమలు చేసి తీరుతాం.. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు అమలు చేశాం.. ఇది కూడా నా డిపార్ట్మెంట్ పరిధిలో కులగణన తీర్మానాన్ని ప్రవేశ పెట్టాం అని ఆయన చెప్పారు. బలహీన వర్గాలకు ఇచ్చిన హామీలు అన్ని నెరవేరుస్తామని.. ఎంబీసీ కోసం గత ప్రభుత్వం వెయ్యి కోట్లు ఇచ్చి రూపాయి కూడా విడుదల చేయలేదు.. మున్నరు కాపు, ముదిరాజ్, యాదవ్, పద్మశాలి లకి ప్రత్యేక సంస్థ ఉండడానికి కృషి చేస్తాం.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఒక్కోటి చేస్తామన్నారు. సర్కార్ వచ్చి 70 రోజులు కాలేదు.. ఎవరు ఆందోళన చెందవద్దు.. సకల జనుల సర్వే రిపోర్ట్ సభ ముందుంచాలని పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు.

# నవశకానికి నాంది పలుకుదాం..

# భవితవ్యం ప్రశ్నార్థకం...

## రోజురోజుకు పడిపోతున్న చిన్నపిల్లల వృద్ధి..

**నవీన నాగరిక సమాజంలో ఆర్థిక భారంతో నలిగిపోతున్న కుటుంబాలు నూటికి ఎనభై శాతం మంది ఉన్నట్టు సర్వేలో వెల్లడైంది. ఈ నేపథ్యంలో ఆయా దంపతుల్లో ఆర్థిక భారం అనేక సమస్యల ఒత్తిడి వల్ల పిల్లలు కనే సమయాన్ని వాయిదా వేస్తూ సంతోషాల పేరిట జీవితాన్ని గడిపేస్తున్నారు. ఇలా చేయడం వల్ల గత దశాబ్దం నుంచి ఈనాటి వరకు పిల్లల వృద్ధిలో భారతదేశం వెనుకబడిపోతుంది. ఇదే విషయంపై 'జయభేరి' కౌంటర్ విత్ కడారి శ్రీనివాస్ సమగ్ర విశ్లేషణ....**



**జయభేరి, హైదరాబాద్ :**

మన జీవన విధానం గ్రామీణ వాతావరణం నుంచి పట్టణ నగర జీవన విధానానికి అలవాటు పడిపోతుంది. ప్రతి ఇంటిలో ఆర్థిక అవసరాలు పెరిగిపోయి మానసిక ఉల్లాసం కొరవడుతోంది. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ 4g 5g సేవలు వినియోగిస్తున్న నాగరికత సమాజంలో అనాగరిక పోకడలకు ఎగబడుతూ నూతన దాంపత్య జీవితంలో సంతోషాలకు సంతృప్తికి వాయిదాలు వేసుకుంటూ సమస్య ల వలలో చిక్కుకుంటున్నారు. దశాబ్దం క్రితం పోల్చుకుంటే నూటికి 60 నుంచి 80% వరకు పిల్లల వృద్ధి జరుగుతున్న మన భారత దేశంలో 2021 నాటికి పిల్లల జనాభా తగ్గుతూ వస్తుందని ఓ సర్వే ప్రకారంగా వెల్లడవుతోంది. ఒక్కసారి మనం ఆలోచిస్తే నవీన నాగరిక సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న ఈ సమాజంలో చిన్న చిన్న కుటుంబాలుగా ఏర్పడి ఉమ్మడి కుటుంబాలు సమూలంగా దూరమవుతున్నాయి. అమ్మమ్మ నాన్నమ్మ తాతయ్య అత్తమ్మ వదిన మామ చిన్నమ్మ పెద్దమ్మ బాబాయ్ పిన్ని ఇలాంటి రావి వరుసలన్నీ ఉమ్మడి కుటుంబాల్లో ఉండేవి. కానీ ఇప్పుడు అమ్మా నాన్న అక్క తమ్ముడు ఇవే కుటుంబాలుగా మిగిలిపోతున్నాయి. దీనికి తోడు ఆర్థిక జీవన విధానం పూర్తిగా మారిపోయి నాగరిక సమాజంలో పల్లె వాతావరణాన్ని విడిచిన జనం పట్టణ వాతావరణంలోకి అలవాటు పడి ఆర్థిక భారంతో కుదేలైపోతున్నారు.. నిన్నటికి నిన్న క్రెడిట్ కార్డు భారంతో అప్పు పెరిగిపోయి వేధింపులు ఎక్కువ ఇద్దరు భార్యాభర్తలు తమకు తామే ఆత్మహత్యకి పాల్పడ్డారు. ఇలాంటి సంఘటనలు ఎన్నో ఎన్నెన్నో... రోజురోజుకీ ఆత్మహత్యల భారం పెరుగుతూ ఉంటే దంపతుల్లో ఆందోళన మొదలై ఆర్థిక భారం పెనుభూతమై పిల్లలను తర్వాత కందాములే అనే ఆలోచనలతో సంతోషాలకు సుఖాలకు అలవాటు పడిపోతున్నారు. అందరితో ఆగకుండా జీన్స్ పాయింట్ లతో పాశ్చాత్య నాగరికతతో మన ఆధ్యాత్మిక సంస్కృతికి దూరంగా ఉంటూ పెడదూరనితో ఆహారపు అలవాట్లను మార్చి వేస్తూ తమకు తామే పిల్లలు కనే యంత్రాన్న నేను అనే ఒక ఆలోచనకు వచ్చి ఇప్పుడు నాకెందుకులే పిల్లలు అనుకుంటూ జీవితాన్ని నాలుగుపదుల వయసుల్లోకి నెట్టేస్తున్నారు. దీంతో గత దశాబ్ద కాలం నుంచి భారతదేశంలో పసిపిల్లల వృద్ధి అమాంతంగా పడిపోయింది. దీంతో భారతదేశం ఆందోళనలో పడిపోతుంది. ఒకవైపు పేదరికం భారతదేశాన్ని పట్టిపీడిస్తున్న అభివృద్ధి చెందుతున్న దేశంగా భారతదేశం ప్రపంచ దేశాల్లో ప్రత్యేకంగా ప్రజాస్వామ్యం పేరుతో నిలుస్తూ వస్తోంది. ఇది చెప్పుకోవడానికి బాగానే ఉన్నా 75 సంవత్సరాల స్వతంత్ర భారత అవనిలో పేదరికం ఇంకా నిరుపేదలుగా మిగిలిపోతున్న ప్రజలను చూస్తే ఈ దేశానికి స్వాతంత్రం వచ్చి ఏం లాభం అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది...

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం జరిగి నప్పటి నుంచి రాష్ట్ర జనం రువుదల శాతం తగ్గి ఆత్మహ్యతి కేసులే ఎక్కువవుతున్నాయి. అలా కావడానికి అనేక కారణాలు ఉన్న ముఖ్యంగా నూతన దంపతుల్లో జీవనపు అలవాట్లు ఆహారపు అలవాట్లు మానసిక ఒత్తిడితో క్రమేపి దంపతుల్లో సంతానోత్పత్తి భారీగా తగ్గుతూ వస్తోంది. నిజానికి ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటే కచ్చితంగా నూతన దంపతుల్లో పెళ్లయిన సంవత్సరంలోపే పిల్లల్ని కనేవారు. కానీ నేడు మారుతున్న కాలానికి మానవ జీవన



**ఇదిలాగే కొనసాగితే 2100 నాటికి చిన్నపిల్లల వృద్ధి తగ్గిపోయి పూర్తిగా వయసు మళ్ళీన మెదడు కుళ్ళిన జనాభాతో ఈ దేశం పేదరికంతో ఆర్థిక భారంతో పెను సవాళ్లతో దేశం ముందుకి పోతుందా అనే ఆలోచనలకు తెరలేపుతుంది.**

విధానం మార్పు చెంది ఇప్పుడే పిల్లలు ఎందుకు? కాస్త ఎంజాయ్ చేయనీయండి అంటూ ఆహారపు అలవాట్లు నిద్రలేమి ఆర్థిక భారం మానసిక ఒత్తిడి పెరిగిపోయి అమాంతం నాలుగు పదులు దాటిన పిల్లలు కనే ఓపిక ఈనాటి యువతి యువకుల్లో పూర్తిగా తగ్గుతూ వస్తుంది. అంటే ఇప్పుడే ఎందుకు పిల్లలు అన్న ఆలోచన నుంచి ఈనాటికైనా మనం మార్పు చెందకపోతే ఆధునిక స్వతంత్ర భారత అవనిలో భవిష్యత్తు వృద్ధ భారతదేశంగా మారిన ఆశ్చర్యపోనక్కర్లేదు.

ఒకప్పుడు మన భారతదేశం యువత శక్తితో ముందంజలో నడుస్తూ వస్తున్న ఈనాడు తగ్గిపోవడం ఒక కారణం అయితే ప్రస్తుతం ఉన్న యువత చెడు అలవాట్లకు బానిసలై మద్యానికి దగ్గరగా వెళుతూ మత్తు పానీయాలకు అలవాటు పడిపోయి జీవితాన్ని బుద్ధి చేసుకుంటున్న తరం ఒకవైపు ఉంటే మరుగువైపు అసలు చిన్న పిల్లల వృద్ధి తగ్గిపోతుంది అనే ఆందోళన ఇప్పుడు దేశాన్ని పట్టిపీడిస్తున్న సమస్యగా మారుతుంది. ఇదిలాగే కొనసాగితే 2100 నాటికి చిన్నపిల్లల వృద్ధి తగ్గిపోయి పూర్తిగా వయసు మళ్ళీన మెదడు కుళ్ళిన జనాభాతో ఈ దేశం పేదరికంతో ఆర్థిక భారంతో పెను సవాళ్లతో దేశం ముందుకి పోతుందా అనే ఆలోచనలకు తెర లేపుతుంది.

స్వేచ్ఛ స్వాతంత్రాలు ఒకవైపు సంతోషం సుఖం సంతృప్తి ఆనందం మరొకవైపు ఆర్థిక భారం మానసిక ఒత్తిడి సవాళ్లు ప్రతి సవాళ్లు అనేక సమస్యలు పెరిగిపోయి మానవ జీవన విధానం పూర్తిగా గతి తప్పుతోంది.. ఇది మంచి పద్ధతి కాదు. మనం మారకపోతే మన సమాజం మారదు. ముందు మనం మారాలి. మన ఆలోచనలు మారాలి. మీరు నేను మనందరం కలిస్తేనే ఈ సమస్యకు ఓ పరిష్కారం దొరుకుతుంది. భారతదేశంలోని ప్రజలు కూడా ఆలోచన విధానాన్ని మార్చుకోవాలి కచ్చితంగా చిన్న పిల్లల వృద్ధి పెరిగేలా చూసుకోవాలి వారి భవిష్యత్తుకు బంగరు బాట వేసే లాగున ప్రభుత్వంతో ప్రజలు మమేకమై భారతదేశం అభివృద్ధికి నడుం కట్టాలి.... అప్పుడే దేశం అన్ని రంగాల్లో ముందుకు పోతూ విజయ తీరానికి తెర లేపుతోంది.... ఆ దిశగా మనం మారుతూ మన ఆలోచనలకు పదును పెడుతూ నలుగురికి ఈ విషయాన్ని తెలియజేస్తూ మరో నవశకానికి నాంది పలుకుదాం...




**...కడారి శ్రీనివాస్**
**కాలమిస్ట్, సీనియర్ జర్నలిస్ట్, కవి, రచయిత**

## బీజేపీ సైడ్ ట్రాకేనా

యుద్ధం జరిగింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ హోరాహోరీ తలపడ్డాయి. ఎవరి వాదన వారు వినిపించారు. ఇందులో రాజకీయం ఉందా.. రాష్ట్ర ప్రయోజనాలు ఉన్నాయా అన్న సంగతి తర్వాత కానీ.. అసలు విషయం రెండు పార్టీలు కలిసి బీజేపీ గురించి ప్రజలు ఆలోచించకుండా చేశాయి. కృష్ణా ప్రాజెక్టులు అప్పగించడం లేదా ఉంచుకోవడం రెండింటిలో దేన్నీ తమ విధానంగా చెప్పలేని పరిస్థితిలో బీజేపీ పడిపోయింది. ఈ వ్యవహారంలో బీజేపీ ఆటలో అరటిపండుగా మారింది. ఇది బీజేపీకి పార్లమెంట్ ఎన్నికలకు ముందు తీర్చలేని సమస్యే. ఆ పార్టీ తరపున అసెంబ్లీ లో మహేశ్వర్ రెడ్డి మాట్లాడారు. కానీ ఏపీ నీళ్లు తీసుకెళ్తూంటే.. బీఆర్ఎస్ సైలెంట్ గా ఉందన్న పాతన వాదనే వినిపించారు. కొత్త విషయలేం చెప్పలేదు. కృష్ణా ప్రాజెక్టుల అంశాన్ని గట్టిగా తమ పార్టీ తరపున సమర్థించుకోవడమో లేదా రెండు పార్టీలు కలిసి నాటకాలు ఆడుతున్నాయన్న సంగతిని కానీ గట్టిగా చెప్పలేకపోయారు. కృష్ణా రివర్ మేనేజ్మెంట్ బోర్డుకు ప్రాజెక్టులను అప్పగించిన వ్యవహారంపై అసెంబ్లీలో వాడివేడి చర్చ జరిగింది. ఈ చర్చ సారాంశం ఏమిటంటే కేంద్ర ప్రభుత్వమే ప్రాజెక్టులను బలవంతంగా తీసుకుంటూ తెలంగాణకు అన్యాయం చేస్తుందన్న సందేశం ఇవ్వడం. బీఆర్ఎస్ నేతలు అదే తరహా ప్రసంగాలు చేశారు. కాంగ్రెస్ నేతలూ అదే చెప్పారు. అయితే ఇక్కడ రాజకీయం ఏమిటంటే వీరి ప్రసంగాల్లో ఎక్కడా కేంద్రాన్ని తప్పు పట్టలేదు. కానీ.. అసలు విలన్ కేంద్రమేనన్న సంకేతాలను గట్టిగా పంపారు. కృష్ణా ప్రాజెక్టుల్ని కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రానికి అప్పగిస్తోందనేది బీఆర్ఎస్ ప్రధాన ఆరోపణ. తాము అప్పగించే ప్రశ్నే లేదని.. గతంలోనే అప్పగిస్తూ సంతకాలు చేశారని కాంగ్రెస్ వాదిస్తోంది. దీనిపై అసెంబ్లీలో వాడివేడి చర్చ. ఇందులోనే తాము ప్రాజెక్టులు అప్పగించబోమని తీర్మానం చేసింది కాంగ్రెస్.. బీఆర్ఎస్ సమర్థించింది. మరి బీజేపీ ఎక్కడ ?. రెండు విధాలుగా ఇరుక్కుపోయింది బీజేపీ అందుకే సైలెంట్ అయిపోయింది. రెండు పార్టీలు కలిసి పరస్పర యుద్ధం చేసుకుంటున్నట్లుగా షో చేసి.. బీజేపీని విలన్ గా ప్రజల ముందు పెట్టాయన్న అనుమానాలు బీజేపీ నేతలు పెరుగుతున్నాయి. అసెంబ్లీ యుద్ధం చూస్తే తెలంగాణలో రాజకీయం అంతా బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య జరుగుతోందని అనిపిస్తే అందులో తప్పేమీ లేదు. ఎందుకంటే ఈ విషయంలో బీజేపీ తన వాదన కూడా వినిపించడానికి ఆసక్తి చూపించలేకపోయింది. ఇద్దరూ నాటకాలు ఆడుతున్నారని అంటున్నా.. బీజేపీ గురించి పట్టించుకోకుండా గ్రౌండ్ లో ఉత్కంఠ భరిత యుద్ధం చేసేస్తున్నారు బీఆర్ఎస్, కాంగ్రెస్ కేసీఆర్ నల్లగొండలో సభ పెడితే.. కాంగ్రెస్ మేడిగడ్డ టూర్ ఏర్పాటు చేసింది. ప్లాన్డ్ గా ఎమ్మెల్యేలందర్నీ తీసుకెళ్తామని చెప్పింది. అసెంబ్లీలో ప్రాతినిధ్యం ఉన్న పార్టీల్లో కాంగ్రెస్, సీపీఐ, మజ్లిస్ పార్టీలు మేడిగడ్డకు వెళ్లాయి. బీఆర్ఎస్, బీజేపీ మాత్రమే వెళ్లలేదు. దీంతో ఆ రెండు పార్టీల మధ్య బంధం ఉందని.. కాంగ్రెస్ ప్రచారం చేస్తోంది. దీన్నిగట్టిగా తిప్పికొట్టలేని పరిస్థితుల్లో బీజేపీ పడిపోయింది. గతంలోనూ ఇలాంటి ప్రచారమే జరిగింది. అది బీజేపీకి నష్టం చేసింది. తెలంగాణలో బీఆర్ఎస్ , కాంగ్రెస్ మధ్యే ఏదో పోరాటం నడుస్తోందని.. రెండు పార్టీల మధ్యే యుద్ధం జరుగుతోందని అనిపించడానికి.. కృష్ణా ప్రాజెక్టులు, మేడిగడ్డతో పాటు ఇతర అంశాలతో రాజకీయం చేస్తున్నారని బీజేపీ అనుమానిస్తోంది. అసలు లేని వివాదాన్ని తెరపైకి తెచ్చి సభలు.. సమావేశాలు పెట్టుకుంటున్నారని.. ఇదంతా లోక్ సభ ఎన్నికల రాజకీయం అని గట్టిగా నమ్ముతోంది. కానీ.. కౌంటర్ ఇవ్వడానికి మాత్రం ఆ పార్టీకి సరైన అవకాశం .. వాయిస్ దొరకడం లేదు. కృష్ణా ప్రాజెక్టుల్ని తాము కాపాడుతున్నామంటే.. తాము కాపాడుతున్నామని బీఆర్ఎస్, కాంగ్రెస్ అసెంబ్లీ వేదికగా వాదించుకుంటున్నాయి. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ రోజు సాగర్ డ్యాంపై ఏం జరిగిందో అందరూ చూశారు. ప్రాజెక్టును ఆక్రమించుకున్న ఏపీ పోలీసులు బలవంతంగా గేట్లు కూడా ఎత్తేసుకున్నారు. ఇదంతా రాజకీయ వ్యూహంలో భాగమన్న అనుమానాలు ఉన్నాయి. ఇది రెండు రాష్ట్రాల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడటానికి కారణం అయింది. మరోసారి అలా జరగకుండా కేంద్రం రక్షణ ఏర్పాటు చేసింది. లోక్ సభ ఎన్నికలపై బీజేపీ చాలా ఆశలు పెట్టుకుంది. మోదీ హవా, రామమందిరం ట్రాన్స్తో కనీసం పది సీట్లను గెల్చుకోవాలని టార్గెట్ పెట్టుకుంది. కానీ రాజకీయ పరిస్థితులు మాత్రం.. రెండు పార్టీల మధ్య పోరాటంలా మారుతోంది. లోక్ సభ ఎన్నికలు కాబట్టి బీఆర్ఎస్కు అసలు చాన్స్ ఉండదని రెండు జాతీయ పార్టీల మధ్య పోరాటం జరుగుతుందని అనుకున్నారు. కానీ బీఆర్ఎస్ బలంగా కాంగ్రెస్ తో పోటీ పడేందుకు ప్రయత్నిస్తోంది. ప్రజలు.. ఓటర్లు బీజేపీ వైపు ఆలోచించకుండా రాజకీయాలు సాగుతున్నాయి. ఇదంతా కాంగ్రెస్, బీఆర్ఎస్ మాత్రమే యుద్ధం చేస్తున్న భావన కల్పించేందుకు ప్రయత్నిస్తున్నారని బీజేపీ నేతలంటున్నారు.

# చత్రపతి శివాజీ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం

**జయభేరి, మేడిపల్లి :**
ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి అక్షిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏడి ఆర్ఎం బ్లడ్ బ్యాంక్ వారి సహకారంతో "చత్రపతి శివాజీ " 394వ జయంతి సందర్భంగా ఆదివారం నాడు ఉప్పల్ డిపో ఏఐఎస్ఎఫ్ కార్యాలయం వద్ద రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ హాజరైనారు.






50 మంది విద్యార్థి, యువత రక్త దానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మతసామరస్యానికి ప్రతీక ఛత్రపతి శివాజీ మహారాజ్ అని అన్ని వర్గాల ప్రజలకోసం వారి అభ్యున్నతి కోసం పాటుపడిన గొప్ప యోధుడు అని, దేశంలో ఉన్న యువత వారిని ఆదర్శంగా తీసుకొని అనేక కార్యక్రమాలు నిర్వహిస్తురన్నారని అన్నారు. రక్త దాన శిబిరాలు ఏర్పాటు చేయడంతో ఆపదలో ఉన్నవారికి రక్తం దానం చేయడం ద్వారా ఒక ప్రాణాన్ని కాపాడవచ్చు. ఇంకా అనేక సేవ కార్యక్రమాలు నిర్వహించాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి చిన్న, ఎండీ అన్వర్, ఉపాధ్యక్షులు హరీష్, అక్షిత ఫౌండేషన్ వ్యవస్థాపకులు బిట్టు, పవన్, యశ్వంత్, పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కకవిడ కుమార్, ఏఐఎస్ఎఫ్ నాయకులు రాజు, వినీల్, మహేష్, రాకేష్, హరీష్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# 108 కళశాలతో శతఘట్టబిశేకం

**జయభేరి, మేడిపల్లి :**
పీర్జాదిగూడ లోని విష్ణుపురి కాలనీలో గల శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం షోడశ (16వ) వార్షిక బ్రహ్మోత్సవములలో భాగంగా నిర్వహించిన స్వామి వారి 108 కళశాలతో శతఘట్టబిశేకం, 1008 అరటి పండ్లతో అర్చన, నిత్య హోమం, మహాపూర్ణహుతి అనంతరం కృష్ణ మూర్తి నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి హాజరై అన్నదాన కార్యక్రమం లో భాగంగా భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి, ఆలయ శాశ్వత అన్నదాత అయిన కృష్ణ మూర్తి, ఆలయ





కమిటీ సభ్యులు రాంగోపాల్ వర్మ, ఆకుల రాజు, అంబ దాస్, బాబు రావు, యాదగిరి, నాగేశ్వర్, రాము ఆచారి, వినాయక్, వినయ్, రఫీక్, శశికాంత్, గోవింద్, ఉమేష్, సాయినాథ్, ఆలయ పూజారులు కరుణాకర్ ఆచార్యులు, వేణుగోపాల్ పంతులు తదితరులు పాల్గొన్నారు.



# పసందైన విందు..!

- వేడుకగా మంత్రి పొంగులేటి సోదరుడు ప్రసాద్ రెడ్డి తనయుని వివాహ రిసెప్షన్ వేడుక
- భారీగా తరలొచ్చి లోహిత్ రెడ్డి- భవాని దంపతులను దీవించిన ప్రజానీకం
- అతిథులను ఆకట్టుకున్న 'పీఎస్ఆర్ ప్యాలెస్' సెట్టింగ్
- హాజరైన మంత్రులు భట్టి, కోమటి రెడ్డి, తుమ్మల, ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులు

**జయభేరి, కల్లూరు :**
ఐదెకరాల్లో 'పీఎస్ఆర్ ప్యాలెస్' సెట్టింగ్.... ఇరవై ఐదు ఎకరాల్లో నోరూరించే వెజ్, నాన్ వెజ్ వంటకాలతో భోజన ఏర్పాట్లు..... మరో నలభై ఎకరాల్లో వాహనాల పార్కింగ్.... మొత్తంగా 70 ఎకరాల్లో జరిగిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సోదరుడు ప్రసాద్ రెడ్డి తనయుని వివాహ రిసెప్షన్ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. వారి స్వగ్రామమైన కల్లూరు మండలం నారాయణపురం గ్రామంలో జరిగిన ఈ వేడుకకు ఉమ్మడి ఖమ్మంజిల్లా వ్యాప్తంగానే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భారీగా ప్రజలు తరలొచ్చి లోహిత్ రెడ్డి భవాని దంపతులను దీవించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాధురి దంపతులు ఆయన సోదరుడు పొంగులేటి ప్రసాద్ రెడ్డి శ్రీలక్ష్మి దంపతులు వేడుకకు విచ్చేసిన వారినిఅతిథి మర్యాదలతో ఆహ్వానించారు. మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, కోమటి రెడ్డి వెంకట రెడ్డి, ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, మట్టా రాగమయి, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, వివిధ వ్యాపార, వాణిజ్య రంగ ప్రముఖులు, ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని నూతన వధూవరులను దీవించారు.

### ఆకట్టుకున్న 'పీఎస్ఆర్ ప్యాలెస్ ' సెట్టింగ్...!

వధూవరులు ఆసీనులయ్యే వేదికను ఐదు ఎకరాల్లో సువిశాలంగా మలిచారు. పీఎస్ఆర్ ప్యాలెస్ పేరుతో రాజభవనం ఆకృతిలో భారీ సెట్టింగ్ వేశారు. హిందూ సంప్రదాయం ఉట్టిపడేలా, ఆధ్యాత్మిక గోపుర నమూనాలో తీర్చిదిద్దిన ఈ భారీ సెట్టింగ్ చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ భవనానికి ఇరువైపులా కొండల మీది నుంచి జలపాతం జాలువారేలా, సహజసిద్ధంగా ఉండేలా మలచడం విశేషం. వీటితో పాటు.. ప్రత్యేక స్టాళ్లు, పచ్చని పూదోటలు, ఫౌంటెన్లు ఇలా అనేకం.. ఈ విశాల ప్రాంగణంలో ఆహ్లాదాన్ని పంచాయి.

### ఆహా ఏమిరుచి...!

వేడుకకు విచ్చేసిన అతిథులకు మొత్తంగా 12 స్టాళ్లను ఏర్పాటు చేసి విందు భోజనం పెట్టారు. పది స్టాల్లు నాన్ వెజ్, ఒక స్టాల్ వెజ్, మరో స్టాల్ వీఐపీ ల కోసం ఏర్పాటు చేశారు. చికెన్ బిర్యానీ, మటన్ బిర్యానీ, రొయ్యల వేపుడు, తందూరి చికెన్, మటన్ కర్రీ, గోంగూర బోటీ, యాట తలకాయ కూర.. రుమాలీ రోటీ.. ఇలా పలు రకాల నోరూరించే వంటకాలు విచ్చేసిన వారికి వడ్డించారు. భోజనం తర్వాత నాలుగు రకాల ఐస్ క్రీములు, సీతాఫల్ జ్యూస్, డబుల్ కా మీఠా, స్వీట్ ఖిల్లీ ఏర్పాటు చేసి అందరికీ పసందైన భోజనాన్ని అందించారు.

### ఎలాంటి అసౌకర్యం కలగకుండా భద్రతా ఏర్పాట్లు...

వేడుకగా వేలాదిగా ప్రజానీకం తరలివస్తారని ముందుగానే అంచనా వేసి అందుకు తగినట్లుగా ఏర్పాట్లును చేశారు. పార్కింగు ఎలాంటి అసౌకర్యం కలగకుండా భద్రతా ఏర్పాట్లును చేశారు. ఏసీపీ స్థాయి అధికారుల పర్యవేక్షణలో సీఐలు, ఎస్ఐలు, ఏఎస్ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది బందోబస్తు ఏర్పాట్లును పర్యవేక్షించారు. ప్రథమ చికిత్స కేంద్రం, ఫైర్ సర్వీస్ ఇలా భద్రత పరమైన అన్ని జాగ్రత్తలను తీసుకోని వేడుకలను సజావుగా నిర్వహించారు.

# సంకల్పం బలంగా ఉంటే విజయం నీకు బానిస

- తమిళనాడు బిడ్డ శ్రీపతి విజయ గాధ

**జయభేరి, తమిళనాడు :**
టీనేజ్ అమ్మాయి శ్రీపతి తమిళనాడు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది సరిగ్గా 20 సంవత్సరాలు నిండకుండానే జూనియర్ సివిల్ జడ్జ్ గా ఎంపికైంది. తల్లిదండ్రులు పడ్డ కష్టానికి అమ్మాయి శ్రీపతి మొక్కవోని దీక్షతో చదివి ప్రజలందరినీ అబ్బురపరిచింది. వివరాల్లోకి వెళితే... శ్రీపతి తల్లిదండ్రుల సొంత ఊరు చెన్నై నుండి 250 కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరువన్నమలై దగ్గర జువ్వాధి గ్రామం. పర్వత శ్రేణుల మధ్య గిరిజన గూడెం. తండ్రి పేరు కాళిదాస్, తల్లి మల్లిగ కొండప్రాంతంలో పోడు వ్యవసాయం చేసేవాళ్ళు. శ్రీపతి కి చెల్లెలు, తమ్ముడు ఉన్నారు. పిల్లల చదువు కోసం ఆ కుటుంబం దగ్గరలోని అత్నవర్ పల్లెకు వలస వచ్చింది. అక్కడ పోడు వ్యవసాయం అయినా పిల్లలు చదువు కోడానికి మంచి స్కూల్ ఉందని సంతోషించారు. కాళిదాస్ టూరిస్ట్ ప్రదేశాల్లో హౌజ్ కీపింగ్ లాంటి పనులకు కుదురుకున్నాడు. వాళ్ళది ' మలయలి ' అనే అత్యంత వెనుకబడిన గిరిజన తెగ.. ఆ తెగలో అమ్మాయిలను చదివించడం, బయటకు పంపడం పట్ల అనేక ఆంక్షలు ఉంటాయి. కాళిదాస్, మల్లిగ దంపతులు ఇవి ఏమీ పట్టించుకోలేదు. శ్రీపతి చదువులో ముందు ఉండడం, ఉన్నత చదువులు చదువుతాను అని పట్టు బట్టడంతో ఆమెను తిరువన్నామలై లో లా కోర్సు చదివించారు.

బంధువుల ఒత్తిడి కారణంగా శ్రీపతి కి వెంకట్రామన్ తో వివాహం జరిపించారు. పెళ్ళైనా శ్రీపతి చదువు ఆపలేదు. డా. బి ఆర్ అంబేద్కర్ లా విశ్వవిద్యాలయం లో పీజీ చేసింది. వెంటనే జూనియర్ సివిల్ జడ్జ్ పరీక్షకు అప్లై చేసింది. అయితే పరీక్ష కు అప్లై చేసేనాటికే తాను గర్భవతిని అని తెలిసింది. సరిగ్గా పరీక్ష



తన డెలివరీ ఒకేసారి అయ్యేలాగ ఉందని ఆందోళన చెందింది. అయితే తల్లిదండ్రులు, తన ఫేవరెట్ టీచర్ మహాలక్ష్మి , భర్త వెంకట్రామన్ ధైర్యం చెప్పారు. చదువుకోవడం పట్ల దృష్టి పెట్టు అంతా మంచే జరుగుతుందని సర్ది చెప్పారు.

శ్రీపతి తదేక దీక్షతో పరీక్షలకు చదివింది. తల్లి మల్లిగ అనుక్షణం శ్రీపతి ఆరోగ్యం కని పెట్టుకుని ఉంది. పరీక్ష డేట్ వచ్చేసింది. డెలివరీకి వెళ్ళేముందు కూడా పుస్తకాలు వదలలేదు శ్రీపతి. నవంబర్ 27న శ్రీపతి పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. నవంబర్ 29న పరీక్ష. శ్రీపతి రెండ్రోజుల బాలింత, పరీక్ష 250 కిలోమీటర్ల దూరంలో ఉన్న చెన్నైలో. అయినాసరే పరీక్ష రాస్తానని పట్టుబట్టింది. డాక్టర్లు వారించినా వినలేదు. తన శ్రమ వృధా కాకూడదని వేడుకుంది. తల్లిదండ్రులు భర్త సహకారంతో పసిగుడ్డుతో ప్రయాణం చేసి పరీక్ష వ్రాసింది. సెలెక్ట్ అయ్యింది. TNPSC లో ఇంటర్వ్యూ కు అటెండ్ అయ్యింది. ఫిబ్రవరి 15, 2024 నాడు జూనియర్ సివిల్ జడ్జ్ గా మొట్టమొదటి గిరిజన మహిళగా అపాయింట్మెంట్ ఆర్డర్ అందుకుంది..

ముఖ్యమంత్రి స్టాలిన్ , మంత్రి ఉదయనిధి స్టాలిన్ శ్రీపతి కి ప్రత్యేక శుభాకాంక్షలు అందించారు. తమ ద్రవిడియన్ మోడల్ సక్సెస్ కు ( తమిళ్ మీడియం లో చదివిన గ్రామీణ గిరిజన ప్రాంతాల్లో చదివిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రిఫరెన్స్) వల్ల వెనుకబడిన తెగకు చెందిన ఈ యువతి విజయం ఉదాహరణ అన్నారు.

అకుంఠిత దీక్షతో, ఎన్ని అవాంతరాలు ఎదురైనా ధైర్యంగా తట్టుకొని చదివి , విజయాన్ని అందుకున్న ఈ బంగారు తల్లి శ్రీపతి విజయగాధ ఆమెలాంటి వందల మంది కి ఆదర్శం.. తన టీచర్ మహాలక్ష్మి అన్నట్లు ఇప్పుడు శ్రీపతి రెక్కలకు ప్యారాచ్యూట్ అమరినట్లు తన హోదా చక్కగా అమరింది.. ఇక దూసుకెళ్లడమే.. జూనియర్ సివిల్ జడ్జ్ శ్రీపతి మేడం కు శుభాకాంక్షలు..



# మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**జయభేరి, ఉప్పల్ :**
చిలుకానగర్ లో మల్లారెడ్డి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు డా॥సి.హెచ్.భద్రారెడ్డి. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, BRS డివిజన్ అధ్యక్షుడు పల్లె నర్సింగరావు, పార్టీ నాయకులు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# టేస్టీ ఫ్లైర్ రెస్టారెంట్ ప్రారంభించినా ఎమ్మెల్యే బండారి



**జయభేరి, కాప్రా :**
టేస్టీ ఫ్లైర్ రెస్టారెంట్ హోటల్ ప్రారంభించినా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఆదివారం LIG, APIIC, కాలనీ కుషాయిగూడ, ECIL లో టేస్టీ ఫ్లైర్ రెస్టారెంట్ హోటల్ ప్రారంబోత్సవ కార్యక్రమానికి అతిథిగా శాసన సభ్యులు బండారి లక్ష్మా రెడ్డి పాల్గోన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీహరి, లితున్ మనోహర్, జంపాల్, మహేష్ గౌడ్, అజిత్ తదితరులు పాల్గోన్నారు.

# ధ్వజ స్తంభ ప్రతిష్టా మహోత్సవం

- మాజీ శాసన సభ్యులు రవీంద్ర కుమార్ ప్రత్యేక పూజలు



**జయభేరి, చందంపేట :**
చందంపేట మండలం గగిళ్ళపురం గ్రామంలో శ్రీ మహాగణపతి, నవగ్రహ, కనకదుర్గ, ధ్వజ స్తంభ ప్రతిష్టా మహోత్సవం కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు రవీంద్ర కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి అని అయన అన్నారు.అనంతరం మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ గారిని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రైతు బందు అధ్యక్షులు బోయపల్లి శ్రీనివాస్ గౌడ్, కెతవత్ శంకర్ నాయక్, మాధవరం జనార్ధన్ రావు, రాఘువా చారి, మాజీ సర్పంచ్ గంగిడి కొండల్ రెడ్డి, వేముల రాజు, బొడ్డుపల్లి కృష్ణ, రమావత్ తులిసిరం, వడత్య బాలు, బుయ్య మహేష్, బిజిలి సుధాకర్, తదిదరులు ఉన్నారు.

# కీచక టీచర్ అరెస్టు



**జయభేరి, రంగారెడ్డి:**
శంషాబాద్ లోని ఐఏఎస్ అకాడమీలో దారుణం జరిగింది. విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఓ మైనర్ విద్యార్థినికి ప్రేమ పాటలు నేర్పి ఆమెను కిడ్నాప్ చేసి అత్యాచారాని ఒడిగట్టిన కీచక టీచర్ భాగోతం ఇది. కీచక టీచర్ సూర్యదీప్ ను శంషాబాద్ ఆర్.జి.ఐ.ఏ పోలీసులు అరెస్టు చేసారు. గత కొంతకాలంగా ఐఏఎస్ అకాడమీలో నిందితుడు సూర్యదీప్ హిస్టరీ లెక్చరర్ గా ఉద్యోగం చేస్తున్నాడు. నిందితుడు నిజామాబాద్ ప్రాంతానికి చెందిన సూర్యదీప్, అదే కాలేజీలో చదువుతున్న ఓ మైనర్ బాలికపై కన్నేసాడు. బాలికకు మాయ మాటలు చెప్పి ప్రేమ పేరుతో వంచన చేసాడు. మైనర్ బాలికను కిడ్నాప్ చేసి నగరానికి తీసుకువెళ్లి ఆమెపై అత్యాచారానికి ఒడిగట్టాడు. విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో పోలీసులరే ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపట్టి నిందితుడు సూర్యదీప్ ను అదుపులోకి తీసుకుని అతనిపై కిడ్నాప్, ఫోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు.








# నా జీవన రేఖ.. నా సౌభాగ్య రేఖ.. నా భాగస్వామి సురేఖ..

చిరంజీవి ఎంత గొప్ప సూపర్‌స్టారో అంతగొప్ప ఫ్యామిలీ పర్సన్ కూడా. కుటుంబాన్ని అమితంగా ప్రేమిస్తారాయన. ముఖ్యంగా తన సతీమణి సురేఖకు ఆయనిచ్చే గౌరవం నిజంగా అభినందనీయం. నేడు సురేఖ పుట్టినరోజు. ఈ సందర్భంగా తన శ్రీమతిపై ఉన్న ప్రేమను కవిత రూపంలో వ్యక్తం చేశారు చిరంజీవి. 'నా జీవన రేఖ.. నా సౌభాగ్య రేఖ.. నా భాగస్వామి సురేఖ.. హ్యాపీ బర్త్‌డే' అంటూ ప్రత్యేకంగా ఓ కవిత రాసి, సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారాయన. అంతేకాదు, ఆమెతో కలిసి దిగిన ఓ ఫొటోను కూడా ఈ పోస్ట్‌కి జత చేశారు. ఇక ఆ పోస్ట్ సోషల్‌మీడియాలో ప్రత్యక్షమైన దగ్గర్నుంచి సురేఖకు శుభాకాంక్షలు వెల్లువలా వచ్చిపడుతున్నాయి. కొందరు అభిమానులైతే ఆ కవితను స్క్రీన్‌షాట్స్ తీసుకొని పోస్ట్ చేస్తున్నారు. కొందరేమో చిరంజీవి దంపతుల పిక్‌ని పోస్ట్ చేస్తున్నారు. మరోవైపు.. అత్తగారి పుట్టినరోజును పురస్కరించుకొని కోడలు ఉపాసన.. 'అత్తమ్మ కిచెన్' పేరుతో ఫుడ్ బిజినెస్ ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. దానికి సంబంధించిన ప్రొడక్ట్ ప్యాకెట్లను కూడా సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. ఏదిఏమైనా సురేఖకు ఇది గుర్తుంచుకోదగ్గ పుట్టినరోజు అని, అటు భర్త నుంచి ఇటు కోడలి నుంచి ఊహించని బహుమతులు అందుకోవడం నిజంగా ఆనందించదగ్గ విషయమే అని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇదిలావుంటే.. ప్రస్తుతం సతీసమేతంగా చిరంజీవి అమెరికాలో ఉన్నారు. పద్మవిభూషణ్ అందుకున్న తర్వాత పరిశ్రమనుంచి, అభిమానుల నుంచి వెల్లువెత్తిన అభినందనల తాకిడిని అనుభవించిన చిరంజీవి.. కాస్త విశ్రాంతి కోసం భార్యతో కలిసి అమెరికా వెళ్లారు. అక్కడ పలు కార్యక్రమాలలో ఆయన పాల్గొంటున్నారని సమాచారం.

# పెను ప్రమాదం..

## బయపడ్డ నేషనల్ క్రష్

' ఈ రోజు మేం మృత్యువు నుంచి తప్పించుకున్నాం' అంటూ హీరోయిన్ శ్రద్ధాదాస్‌తో కలిసి దిగిన ఓ ఫొటోను తన ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది నేషనల్ క్రష్ రష్మిక. ఈ పోస్ట్ చూసిన ఆమె అభిమానులందరూ కంగారు పడిపోయారు. ఇక అసలు విషయంలోకి వెళ్తే.. ఇటీవల ముంబయ్ నుంచి హైదరాబాద్ విమానం ప్రయాణం చేసింది ఈ అందాలభామ. ఈ ప్రయాణంలోనే పెను ప్రమాదం నుంచి తప్పించుకుంది. ముంబయి నుంచి టేకాఫ్ అయిన 30 నిమిషాలకే రష్మిక ప్రయాణిస్తున్న విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. దాంతో పైలెట్ చాకచక్యంగా విమానాన్ని ముంబయ్‌లోనే అత్యవసర ల్యాండింగ్ చేశాడు. దీంతో ప్రయాణంలోని వారంతా ఊపిరిపీల్చుకున్నారు. ఈ విమానంలో రష్మికతోపాటు మరో కథానాయిక శ్రద్ధాదాస్ కూడా ప్రయాణిస్తుండటం విశేషం. ఈ భయానక అనుభవాన్ని తన ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది రష్మిక. ఇక రష్మిక కెరీర్ విషయానికొస్తే.. ఇటు టాలీవుడ్, అటు బాలీవుడ్ సినిమాలతో ఆమె బిజీబిజీ. 'పుష్ప2', రెయిన్‌బో, ది గర్ల్‌ఫ్రెండ్, చావా ప్రస్తుతం ఆమె చేతిలోవున్న సినిమాలు.



# పండంటి బిడ్డకు జన్మనిచ్చిన

## టాలీవుడ్ సింగర్ గీతా మాధురి

టాలీవుడ్ స్టార్ సింగర్ గీతా మాధురి మరోసారి పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. ఫిబ్రవరి 10న పండంటి మగ బిడ్డకు జన్మను ఇచ్చినట్టుగా గీతా మాధురి ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రకటించింది. గీతా మాధురి సీమంతం వేడుక ఇటీవలే ఘనంగా జరిగిన విషయం తెలిసిందే. ఇక సీమంతం రోజు అయితే 800 మందికి అన్నదానం కూడా చేసినట్లు సోషల్ మీడియాలో ఫొటోలు వైరల్ అయ్యాయి. గీతాకు మొదటగా ప్రకృతి పుట్టగా.. ఈ సారి మగ బిడ్డకు జన్మను ఇచ్చింది. ఇక ఈ విషయం తెలుసుకున్న టాలీవుడ్ సినీ ప్రముఖులు గీతా, నందు జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. టాలీవుడ్ నటుడు నందు, గీతా మాధురి ప్రేమ వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. 2014లో వీరి పెళ్లి జరుగగా.. 2019 పాపకు జన్మనిచ్చారు. ఇప్పుడు రెండోసారి మగ బిడ్డకు జన్మనిచ్చారు గీతామాధురి.

# శంకర్ కూతురి రెండో పెండ్లి..

ప్రముఖ డైరెక్టర్ శంకర్ కూతురు మళ్లీ పెండ్లిపీటలు ఎక్కబోతున్నది. మొదటి భర్తతో విడిపోయిన శంకర్ పెద్ద కూతురు ఐశ్వర్య.. అసిస్టెంట్ డైరెక్టర్ తరుణ్ కార్తికేయన్‌తో రెండో వివాహానికి సిద్ధమయ్యింది. తాజాగా వీరిద్దరికి నిశ్చితార్థం కూడా జరిగింది. ఈ విషయాన్ని శంకర్ రెండో కూతురు అదితి శంకర్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పంచుకుంది. అలాగే ఎంగేజ్‌మెంట్‌కు సంబంధించిన ఫొటోలను కూడా షేర్ చేసింది. శంకర్ పెద్ద కూతురు ఐశ్వర్య 2021లో క్రికెటర్ రోహిత్ దామోదరన్‌ను పెండ్లి చేసుకుంది. కానీ కొద్ది నెలలకే వారి మధ్య విబేధాలు వచ్చాయి. పైగా రోహిత్ దామోదరన్ నిర్వహిస్తున్న క్రికెట్ కోచింగ్ సెంటర్‌లో మహిళా ఆటగాళ్లతో అసభ్యంగా ప్రవర్తించారనే ఫిర్యాదులు రావడంతో ఆయనపై పోక్సో చట్టం కింద కేసు కూడా నమోదయ్యింది. దీంతో రోహిత్ నుంచి విడాకులు తీసుకుంది. అప్పట్నుంచి ఐశ్వర్య తండ్రి దగ్గరనే ఉంటుంది. ఈ క్రమంలోనే ఇప్పుడు రెండో పెండ్లికి సిద్ధమయ్యింది. తాజాగా ఇంగేజ్‌మెంట్ కూడా జగరడంతో పలువురు సెలబ్రెటీలు కాబోయే దంపతులకు శుభాకాంక్షలు చెబుతున్నారు. తరుణ్ కార్తికేయన్ కేవలం అసిస్టెంట్ డైరెక్టర్ మాత్రమే కాదు. పాటల రచయిత, ప్లే బ్యాక్ సింగర్ కూడా.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Publishedat # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com